క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న ఈఓ, అర్చకులు

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లో ఈనెల 8న నిర్వహించబోయే వేణుగోపాల, సీతారాముల ఉత్సవ మూర్తుల శోభాయాత్రకు హాజరు కావాలని రామాలయ ఈఓ కొండారెడ్డి.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని అందజేసి శేషవస్త్రం, పూలమాలతో మంత్రిని సన్మానించారు. తొలుత వారు ఎమ్మెల్యే పద్మావతిని కలిసి ఆహ్వానించారు. అర్చకులు నరసింహాచార్యులు, దామోదరాచార్యులు, వెంకట నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మోతె పీహెచ్‌సీ వైద్యాధికారిగా రాజేష్



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రాజేష్

మోతె : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ డి.రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెన్‌పహాడ్ మండలం నుంచి మోతె మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్‌కు డాక్టర్ బిందు, వైద్య సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తానన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె. ప్రసన్నకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

మంత్రి సహకారంతో గ్రామాల అభివృద్ధి



యోగా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కటకం ఆశా రమేష్

గరిడేపల్లి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మాజీ ఎంపీపీ, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటకం ఆశా రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న యోగా సెంటర్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల వెంకటేశ్వర్లు, భద్రయ్య, బత్తిని రాంబాబు, గోపయ్య, హుస్సేన్, వెంకన్న, ప్రభాకర్, గురుస్వామి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ, నాయకులు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ బొలిశెట్టి నాగేంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రోడ్డు పనులను నాణ్యవంతంగా సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల కోటయ్య, హనుమంతరావు, మైలారిశెట్టి రాంబాబు, వెంకయ్య, ముసి శ్రీను, యలమందయ్య, తిరపయ్య, నర్సిరెడ్డి, లక్ష్మీనారాయణ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు బెంచీలు ఏర్పాటు



పోలీస్‌స్టేషన్‌లో బెంచీలు ఏర్పాటు చేస్తున్న హరి మిత్రమండలి సభ్యులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఆర్యవైశ్య ప్రముఖుడు చిల్లంచర్ల హరికిషన్ జ్ఞాపకార్థం హరికిషన్ మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పలు కూడళ్లలో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విలేకరిగా విధులు నిర్వర్తించిన హరికిషన్ పలు సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషిచేశాడని కొనియాడారు. హరికిషన్ ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కృషి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



కోదాడరూరల్ : గురుకులంలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్ : ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ మండల పరిధిలోని దోరకుంట ఆవాస గ్రామం నెమలిపురిలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాబార్డు నిధులు రూ.కోటి రూపాయలతో నిర్మించిన 5 అదనపు తరగతి గదులను ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ గురుకులాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.ఝూన్సీరాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఇర్ల సీతారాంరెడ్డి, అమరనాయని వెంకటేశ్వరరావు, మండలపు శేషు, గద్దల వెంకటేశ్వర్లు, పత్తిపాక వెంకటేశ్వర్లు, పాలకి సురేష్, కృష్ణారెడ్డి, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

పట్టణ పరిధిలో తమ్మర నుంచి బండపాలెం వరకు ఎంఆర్‌ఆర్ నిధులు రూ.1.80 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మునగాల : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

మునగాల : క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి సూచించారు. సోమవారం మునగాల మండలంలోని కొక్కిరేణి శివారులో గల పోటు పుల్లయ్య స్మారక వివేకానంద వైద్యశాల ఆవరణలో వివేకానంద ట్రస్టు సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన క్యాన్సర్ వ్యాధి నివారణ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి నివారణకు చికిత్స పొందాలన్నారు. క్యాన్సస్ వ్యాధి నిర్ధారణ పరీక్షల సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రికి చెందిన క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ క్రిపా బజాజ్ మాట్లాడుతూ.. విషతుల్యమైన ఆహారం తీసుకోవడం వలన క్యాన్సర్ వ్యాధి వస్తుందన్నారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల ఒక జిల్లాను ఎంచుకొని క్యాన్సర్ వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మహిళలు ప్రతి సంవత్సరం ఒకసారి స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించుకోవాలన్నారు. ముందుగా ఆస్పత్రి ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, స్థానిక వివేకానంద వైద్యశాల నిర్వాహకులు పోటు శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

- సీనియర్ సివిల్ జడ్జి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌కుమార్

కోదాడరూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పట్టణంలోని నిరుపేదలకు అందేలా మెప్మా విభాగంలో పనిచేస్తున్న ఆర్పీలు కృషి చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, మైనర్లను పనిలో పెట్టుకోవడం, వరకట్న వేధింపులు వంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కమిషనర్ రమాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కె మూర్తి, న్యాయవాదులు, ఆర్పీలు ఉన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : విద్యా సంస్థలు విద్యార్థులకు చదువుతో పాటు వారిలో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషిచేయాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని దుర్గాపురం క్రాస్ రోడ్డులో మదీనా తుల్ ఉలూం మదర్సా స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులలో బాల్యం నుంచే విజ్ఞానంతో పాటు సమాజంపై అవగాహన కల్పించాలన్నారు. 50 ఏళ్ల కిందట మదర్సాను స్థాపించి విద్యార్థులకు ఉచిత వసతి, విద్య అందిస్తున్న వ్యవస్థాపకుడు అబ్దుల్‌ఖాద్రిరషాది, మౌలానా అహ్మద్‌నద్వీలు అభినందనీయులన్నారు. అనంతరం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా మెంబర్ మౌలానా అబూ తాలిబ్‌రహమాని మాట్లాడుతూ.. గత 50 ఏళ్లుగా మదర్సా కోదాడలో విద్యార్థులకు విద్యనందిస్తూ ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి పునాదిగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో ఉభయ రాష్ట్రాల్లోని పూర్వ విద్యార్థులు, ఆధ్యాత్మిక ప్రవక్తలు, ముస్లిం పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



ఆర్చీని ప్రారంభిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డిశరణ్య, మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని మూడవ వార్డులో నూతనంగా నిర్మించిన ఎన్జీవోఎస్ కాలనీ ఆర్చ్, రోడ్ల నేమ్ బోర్డు ప్లేట్లను ఆయన ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె.శ్రీను, వి.నాగేశ్వరరావు, ఎం.రామ్‌గోపి, వి.వరలక్ష్మి నాగరాజు, సీహెచ్.సౌజన్య ధనుంజయ్, బి.ధనమ్మజైలు, ఫణికుమారి, వి.సరిత వీరారెడ్డి, త్రివేణి, విజయ వెంకటేశ్వర్లు, ఉపేంద్ర సైదులు, మంజుల హరిబాబు, గాయత్రి భాస్కర్, ఎ.సతీష్, జె.వీరయ్య, వై.విజయ్, వై.గురవయ్య, గంగరాజు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్వీ చారిటబుల్, డీఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

శాఖాహారంతో ఆరోగ్యానికి మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానమండలి సభ్యులు

చిలుకూరు : శాఖాహారంతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని, జంతు బలి చేయవద్దని కోరుతూ మాంసాహారం తినొద్దంటూ నినాదాలు చేస్తూ సోమవారం ధ్యానమండలి ఆధ్వర్యంలో చిలుకూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానమండలి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్రతిరోజు ధ్యానం చేయాలని సూచించారు. ధ్యానంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ధ్యాన మండలి అధ్యక్షుడు కాటేపల్లి శైలజ, సభ్యులు రామా, సత్యానారాయణరెడ్డి, వరలక్ష్మి, దొడ్డా పార్వతి, పొందూరి రమేష్, పొందూరి లక్ష్మి, సంక్రాంతి జయమ్మ, కొడారు పద్మ, పొందూరి ప్రభావతి, అలసకాని రాంబాయమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉద్యమకారుల పాదయాత్ర



పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉద్యమకారులు

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పాలకవీడు మండలంలోని జానపహాడ్ దర్గా నుంచి మంగళవారం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, మలిదశ ఉద్యమకారుడు రాం సైదులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో పాదయాత్ర కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. మలిదశ ఉద్యమకారులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని, నెలకు రూ.25వేలు పెన్షన్ ఇస్తామని చెప్పిన పాలకులు తమ హామీని అమలు చేసే దిశగా ముందడుగు వేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కర్నాటి నాగిరెడ్డి, పంగ వీరస్వామి, బాణోతు వెంకటేశ్వర్లు, వెన్న రవీందర్‌రెడ్డి, గాలి రామకృష్ణ, నూకపంగు ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు కడప ఇసాక్, మేకల శోభన్‌బాబు, కుంకునూరి గోవర్ధన్, మచ్చ హుస్సేన్, బరిగల విజయ్, అనిల్, వీరస్వామి, శ్రీను, రామ్ మధు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ చరమందరాజు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. డ్రైవర్లు ఇన్స్యూరెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. మహిళా ప్రయాణికులతో సభ్యతగా వ్యవహరించాలని అన్నారు. డ్రగ్, ఇతర మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడ పబ్లిక్‌క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కోదాడ: ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కోదాడ పబ్లిక్‌క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం బాధ్యతలు స్వీకరించింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రాధాకృష్ణమూర్తి నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా గాయం పట్టాభిరెడ్డి, కార్యదర్శిగా బొల్లు రాంబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో వేనేపల్లి సత్యనారాయణ, చింతలపాటి శేఖర్, ఓరుగంటి రవి, గుండపనేని వేణుగోపాలరావు, గుడిబండ్ల రాజన్, కారుమంచి సత్యనారాయణ, పాశం నాగిరెడ్డి, పసుపులేటి సత్యనారాయణ, నర్ర వంశీకృష్ణ, ముడియాల భరత్‌రెడ్డి, రావెళ్ల సీతరామయ్య, ఎయిర్ ఫోర్స్ వెంకటరెడ్డి, విద్యాసాగర్‌రావు,హరిబాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్తెల సృజన

మేళ్లచెరువు : సమాజంలో మహిళల హక్కులు, వారి చదువు కోసం పోరాడిన వీరవనితలు సావిత్రిబాయి పూలే, షేక్ ఫాతిమా మహిళలకు ఆదర్శమని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సావిత్రిబాయి మరణానంతరం ఆమె ఆశయ సాధనకు ఫాతిమా భేగం కృషి చేశారన్నారు. ఉప్పతల కోటమ్మ, ఉష, లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల నిరసన



మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



గరిడేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.12వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం మఠంపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, మాజీ జెడ్పీటీసీ జగన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనరసింహరాజు, మాజీ ఎంపీటీసీ నాగునాయక్, మాజీ ఉపసర్పంచ్ కిరణ్, సైదులు, నాగయ్యయాదవ్, రామచంద్రయ్య, కోటానాయక్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై మాట తప్పిన కాంగ్రెస్

గరిడేపల్లి : కాంగ్రెస్ పార్టీ రైతు భరోసాపై మాట తప్పి రైతులను దగా చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ విమర్శించారు. రైతులకు ఏడాదికి రూ. 15వేలు ఇస్తామని మేనిఫెస్టోలో చేర్చి ఇప్పుడు రూ. 12 వేలకు పరిమితం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కడెం వెంకట్‌రెడ్డి, వీరంరెడ్డి శంభిరెడ్డి, పార్థసారథి, వెంకటేశ్వర్లు, రామ్ సైదులు, వెంకటరాములు, నాగిరెడ్డి, ప్రసాద్, రవీందర్‌రెడ్డి, వీరస్వామి, రామకృష్ణ, మేకల ప్రవంతిశోభన్‌బాబు, చిన్న వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

గరిడేపల్లి : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ చలిగంటి నరేష్ అన్నారు. సోమవారం మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, గంజాయి, డ్రగ్స్‌తో కలిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాల నిర్మూలనపై పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు గురి కావద్దని, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనర్సయ్య, నాగేశ్వరరావు, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

హుజూర్‌నగర్ : పట్టణంలో సోమవారం త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సభ్యులు వెంకటేశ్వర్లు, వీరన్న, శివ రామకష్ణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

చిల్లంచర్ల హరికిషన్ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న కిమ్స్ ఆస్పత్రి డాక్టర్

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఆర్యవైశ్య ప్రముఖుడు చిల్లంచర్ల హరికిషన్ మృతి బాధాకరమని కిమ్స్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ క్రిపా బజాజ్ అన్నారు. సోమవారం హరికిషన్ నివాసానికి చేరుకున్న ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. హరికిషన్ మృతి పట్ల ఆమె ద్రిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, హరికిషన్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

న్యూఇయర్ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ



కోదాడరూరల్ : నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్జిలు సురేష్‌కుమార్, భవ్య



మోతె : డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గోపాల్‌రావు, డీటీఎఫ్ నాయకులు



హుజూర్‌నగర్ : డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయ సంఘం నాయకులు

కోదాడరూరల్ : పట్టణంలోని కోర్టు ఆవరణలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) నూతన క్యాలెండర్‌ను కోదాడ సీనియర్ సివిల్ జడ్జి సురేష్, జూనియర్ సివిల్ జడ్జి భవ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి సురేష్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి ఐఏఎల్ సంఘం బాధ్యులు కృషి చేయాలన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కే మూర్తి, ఐఏఎల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గట్ల నర్సింహారావు, ఐఏఎల్ కోదాడ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వెంకటాచలం, ఆవుల మల్లికార్జున్, గోవర్ధన్, శ్రీధర్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్..

మోతె : మండలంలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఎంఈఓ కె.గోపాల్‌రావు ఆవిష్కరించారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు నాయకపు పరమేష్, మండల ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, కోశాధికారి జానయ్య, జిల్లా కౌన్సిలర్లు సింహాద్రి, వెంకన్న, నాగయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ పోరాటం

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ అవిశ్రాంతంగా పోరాటం చేస్తుందని ఎంఈఓ సైదా నాయక్ అన్నారు. సోమవారం హుజూర్ నగర్ క్యాంప్ హైస్కూల్‌లో మండల నోడల్ అధికారి బి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కేవీ సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, పి.అంజయ్య, మైసయ్య, పుల్లీబేగం, అనూష, బి.రామనాథం, శ్రీనివాస్‌కుమార్, జయరామ్, కళింగరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, డి.రవి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్ప యాగం





పుష్పయాగం చేస్తున్న పూజారులు, పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం శ్రీ పుష్ప యాగం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని, గోదాదేవిని, సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అధిష్టింపజేసి భక్తులు అట్లూరి మంజుల హరిబాబు దంపతులచే శ్రీ పుష్పయాగాన్ని జరిపించారు. మహిళలు వివిధ రకాల పూలు తెచ్చి స్వామివారికి సమర్పించారు. నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో మంజలి ఉత్సవం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ వేణుగోపాల శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం మంజలి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, శ్రీ గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆరగింపు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎరగాని గురువయ్య, ఈఓ ఎంపి.లక్ష్మణ్‌రావు, ధర్మకర్తలు అంజయ్య, హరీష్‌కుమార్, కిత, నరసింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, అర్చకులు హరీష్‌కుమారాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండలంలోని దొరకుంట సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు గాను విద్యుత్ లైన్ పనులు చేస్తున్నందున మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఎలక్ట్రికల్ ఏఈ సైదా సోమవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని దొరకుంట ఇండస్ట్రీయల్ ఏరియా, తమ్మరలోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముకుందాపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

నేరేడుచర్ల : మండలంలోని ముకుందాపురంలో గల 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ సోమారం ఫీడర్ కింద 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పనులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ముకుందాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నకిలీ పైపులు విక్రయిస్తున్న దుకాణంపై ఫిర్యాదు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని రేవూరు రోడ్డులో గల ఓ దుకాణంలో సుధాకర్ బ్రాండ్ పేరుతో నకిలీ పైపులు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు సుధాకర్ కంపెనీ ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ మేనేజర్ మోహన్ తెలిపారు. మండలంలోని వేపలమాధవరం గ్రామానికి చెందిన రైతు పైపులు, ఫిట్టింగ్‌లు కొనుగోలు చేయగా అవి నాణ్యత లేకపోవడంతో తమ పైపుల కంపెనీకి ఫిర్యాదు చేయగా సోమవారం దుకాణాన్ని పరిశీలించినట్లు చెప్పారు. సదరు దుకాణంలో విక్రయిస్తున్న పైపులు తమ కంపెనీవి కావని, దుకాణదారుడిపై చర్య తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

గరిడేపల్లి : పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం గరిడేపల్లిలో అక్రమంగ తరలిస్తున్న 30 ఎద్దులు, 10 దున్నపోతులను పోలీసులు పట్టుకున్నారు. బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని వాటిని పరిశీలించి మాట్లాడారు. మూగజీవాలను చిన్నచిన్న వాహనాల్లో కుక్కి, వాటిని హింసించడం దారుణమన్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా మోహన్‌నాయక్

మఠంపల్లి : మండలంలోని గుర్రంబోడుతండాలో గలసేవాలాల్ మహరాజ్ దేవాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కేతావత్ మోహన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సేవాలాల్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నానాయక్, బోడ్కానాయక్, లచ్చీరాంనాయక్, ఎత్తిపోతల పథకం చైర్మన్ నాగునాయక్, శివాజీ, రవీందర్, వశ్యా, యాంకూ, బజ్జా, సక్రూ, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

మఠంపల్లి : మండల కేంద్రంలో సోమవారం మండల ఎమ్మార్పీఎస్ కళాకారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సత్తారపు శివ, ఉపాధ్యక్షుడిగా గోపి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, అధికార ప్రతినిధిగా నాగేష్, కోశాధికారిగా శాంతికుమార్‌ను ఎన్నుకున్నారు. వీరికి జిల్లా ఇన్‌చార్జ్ కోట వీరస్వామి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు ప్రభు, ఎమ్మెస్పీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ఆదినారాయణ, సైదులు, జయరాజు, కరుణాకర్, వీరబాబు, నాగార్జున, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.